క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

సామర్లకోట: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఉన్న రైతు భవనంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. జిల్లాలో అనేక మంది తలసేమియా బాధితులు ఉండటం వలన వారి కోసం రక్తం నిల్వలు పెంచాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారుల సహకారంతో శిబిరం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలోను, పట్టణంలోను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు రక్తదానం చేసే వారిని గుర్తించాలని సూచించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


స్వామివారికి నిర్వహిస్తున్న కల్యాణం

కొత్తపల్లి: గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 2 వేల మంది పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నూకాలమ్మకు రూ.11.81 లక్షల ఆదాయం


నూకాలమ్మ ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారికి హుండీల ద్వారా రూ.11,81,458 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు. జాతర మహోత్సవాల్లో భాగంగా, జాతర మధ్యలో 34 రోజులకు గాను బుధవారం హుండీలను లెక్కించినట్టు చెప్పారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు సోమరాజు, వేణుగోపాల్, డి.శ్రీనివాసరావు సమక్షంలో హుండీలను లెక్కించగా, అమ్మవారికి రూ.11,81,458 ఆదాయం సమకూరిందని ఈఓ సౌజన్య తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


సామర్లకోట సీహెచ్‌సీలో నిర్వహిస్తున్న సామూహిక సీమంతాలు

సామర్లకోట: బిడ్డ ఆరోగ్యం కోసం గర్భిణులు తొమ్మిదో నెల వరకు ప్రతి రోజు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీహెచ్‌సీ డాక్టర్ అమల అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో అమ్మభగవాన్ శరణ్యం సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఆస్పత్రికి వచ్చిన సుమారు 50 మందికి సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. పుట్టిన ప్రతి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు పసుపు, కుంకుమలు, పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సంతోషలక్ష్మి, వరలక్ష్మి, హెడ్ నర్సు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అరుణోదయ

కొత్తపల్లి: నాగులాపల్లిలో ఉన్న ఆటో స్టాండ్ వద్ద బుధవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని స్టేట్ బ్యాంక్ మేనేజర్ అరుణోదయ ప్రారంభించారు. అన్ని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజ్‌కుమార్, అప్పారెడ్డి, నాగేశ్వరరావు, సత్యనారాయణ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యం

- ఆరోగ్య సంపదనిచ్చే కుండలు
- వేసవిలో ఎనలేని గిరాకీ
- ఎండ తీవ్రతతో పెరుగుతున్న కొనుగోళ్లు
- ఒక్కో కుండ రూ.200 నుంచి రూ.250
- కాలక్రమంలో తగ్గిపోతున్న కుమ్మర్లు


ఆకట్టుకుంటున్న రంగురంగుల మట్టి కుండలు, పాత్రలు

పెద్దాపురం: భూదేవి.. సకల జీవాలను కాపాడే దేవి. భూమాత.. సకల వృత్తుల వారికి చేయూత. భూమి నుంచి వచ్చే మట్టితో కుండ తయారవుతుంది. అందులో తాగే నీరు ఆరోగ్యాన్నే కాదు, ఆధ్యాత్మికతను పంచుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఏప్రిల్‌లో ఎండలు మండిపోతున్నాయి. పిల్లలు, వృద్ధులైతే ఉక్కపోత భరించలేక అల్లాడుతున్నారు. ఇప్పటికే 38 డిగ్రీలకు పైగా ఎండ తీవ్రత పెరిగిపోయింది. ఉక్కపోత కూడా తోడవ్వడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎంత నీరు తాగినా దాహార్తి తీరడం లేదు. ఈ నేపథ్యంలో పేదవాడి ఫ్రిజ్‌గా పిలిచే మట్టి కుండలకు గిరాకీ పెరిగింది. పేద, మధ్య తరగతి వర్గాలవారు, ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్నవారు చల్లటి నీటి కోసం మట్టి కుండలను ఆశ్రయిస్తున్నారు. ఎక్కువ శాతం మంది ఫ్రిజ్ నీటికి అలవాటు పడినప్పటికీ, వేసవి రాగానే ప్రతి ఒక్కరూ కుండ నీరు తాగాలని తాపత్రయపడడం సహజ పరిణామం. ఇళ్లల్లో ఫ్రిజ్ ఉన్నప్పటికీ మట్టి కుండలను కొనుగోలు చేయడం గమనార్హం. మట్టి కుండలు సైజును బట్టి రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. రానురాను వీటికి మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

అవగాహన ఉన్నా.. పట్టించుకోరు

మట్టి కుండ వాడకం వల్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉన్నా పట్టించుకున్న పాపాన పోలేదని కుమ్మరి వర్గీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దాపురం అర్బన్, సామర్లకోట అర్బన్‌లో సుమారు 980 కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడి ఉన్నాయి. ప్రధానంగా పెద్దాపురం మండలంలోని చదలాడ, దివిలి, వడ్లమూరు, కట్టమూరు, పులిమేరు, రాయభూపాలపట్నం, దివిలి, కాండ్రకోట గ్రామాలతో పాటు, సామర్లకోట మండలంలోని వేట్లపాలెం, అచ్చంపేట, ఉండూరు, నవర, చంద్రంపాలెం, మాధవపట్నం, వీకే రాయపురం గ్రామాల్లోనూ సుమారుగా 545 కుటుంబాల వారు కుమ్మరి వృత్తినే నమ్ముకుని మట్టి కుండలను తయారు చేస్తున్నారు. ప్రస్తుత వేసవి సీజన్‌లో ఏర్పాటు చేసే చలివేంద్రాల్లోనూ మట్టి కుండలు వినియోగించుకోకపోవడంపై కుమ్మరి వర్గీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం స్పందించి, మట్టి కుండల వినియోగంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

గిట్టుబాటు కాకున్నా వ్యాపారమిదే..



ప్రస్తుతం మట్టి కుండల ధరలు బాగానే ఉన్నా, వాటిని తయారు చేసేందుకు ఖర్చు ఎక్కువ అవుతుంది. కుండ తయారు చేయాలంటే కుటుంబమంతా కష్టపడాల్సిందే. అయినా ఫలితం దక్కే పరిస్థితి తక్కువే. ప్రభుత్వం కుల వృత్తులపై ఆధారపడే వారికి ఉపాధితో పాటు, సబ్సిడీ రుణాలిచ్చి ఆదుకోవాలి.

– పోలీస్, మట్టి కుండల వ్యాపారి పెద్దాపురం

ఇప్పటికీ మక్కువే..

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో.. ఎన్నో రకాల పరికరాలు, వస్తు సామగ్రి కూడా నవీన పోకడలతో తయారవుతున్నాయి. ఇదే క్రమంలో మట్టి పాత్రలకు బదులు అల్యూమినియం, స్టీలు, ఇతర హానికర కెమికల్స్‌తో తయారయ్యే పాన్ల వంటి వాటిని ఇళ్లల్లో వినియోగిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో కుమ్మరి పనిచేసే వారు కూడా అంతగా కానరావడం లేదు. కుక్కర్లు, ఇండక్షన్ స్టౌలు, మైక్రో ఓవెన్ వంటి వాటితో వంట చేస్తున్నారు. వీటిని వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తె అవకాశం ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలాంటి నేపథ్యంలో మట్టి కుండలకు ఏమాత్రం క్రేజ్ తగ్గకపోవడం గమనార్హం. ప్రస్తుతం సోషల్ మీడియాలో పాతతరం వారు తినే ఆహార పదార్థాలు, అలవాట్లు, వస్తువులపై తీవ్ర చర్చ జరుగుతుండడంతో, పలువురు తమ ఆహారపు అలవాట్లు మార్చుకుంటుండడం శుభ పరిణామమని ఆహార నిపుణులు అంటున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్‌కు నేతల వినతిపత్రం


జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ హరిబాబు

సామర్లకోట: పట్టణంలో ఈ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు కోరారు. ఈ మేరకు బుధవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు తాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేసినట్టు హరిబాబు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, తాగునీరు అందించే నాగార్జున ఫిల్టర్ చెరువులో నీరు ఆకుపచ్చ రంగులో ఉందని, నీటిని తొలగిస్తున్నట్టు ప్రకటించారన్నారు. నీటిని పూర్తిగా తొలగించకుండా మరలా నింపుతున్నారని, దాంతో చెరువులో నీరు నాచు రంగులోనే ఉందని చెప్పారు. నీటితో తొలగించే సమయంలో చెరువులో పూడిక తీస్తే, మరో 25 ఏళ్ల వరకు చెరువుకు సమస్యలు ఉండవన్నారు. గోదావరి కాలువలోని నీటిని చెరువులోకి నింపే సమయంలో మున్సిపల్ అధికారులు శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. గోదావరి కాలువలో విచ్చలవిడిగా వ్యర్థ జలాలు కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి కాలువ కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేసి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కలెక్టర్‌ను కోరామన్నారు.

సంస్కరణోద్యమ యోధుడు కందుకూరి

జయంతి సభలో వక్తల నివాళి



పెద్దాపురంలో కందుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కృష్ణబాబు తదితరులు

పెద్దాపురం: నవయుగ వైతాళికుడు, సంస్కరణోద్యమ యోధుడు కందుకూరి వీరేశలింగం పంతులని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక వరహాలయ్యపేట యాలసపు సూర్యారావు భవనంలో బుధవారం పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ), ఎస్ఎఫ్ఐ సంయుక్తాధ్వర్యంలో కందుకూరి జయంతి సభ పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జ్యోస్యుల కృష్ణబాబు, గౌరవాధ్యక్షులు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ, ఆనాటి దురాచారాలకు వ్యతిరేకంగా వీరేశలింగం ఉద్యమించారన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడి, వితంతు వివాహాలను ప్రోత్సహిస్తూ స్వయంగా తన ఇంటిలో వివాహాలు జరిపించారన్నారు. పత్రికా రచనల ద్వారా నాటి సమాజంలో దురాచారాలను ఎలుగెత్తి చాటిన మహోన్నత వ్యక్తి కందుకూరి అని నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితో యువత సమాజంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పని చేయాలన్నారు. తొలుత కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

యువతకు ఆదర్శం

సామర్లకోట: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులును యువత ఆదర్శంగా తీసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. కందుకూరి జయంతి కార్యక్రమం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్ప సంఘ సంస్కర్త, నవయుగ వైతాళికుడు కందుకూరి జీవిత చరిత్రను యువత తెలుసుకోవాలన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, మూఢ నమ్మకాల నిర్మూలనకు ఆయనెంతో కృషి చేశారని తెలిపారు. వితంతు వివాహాన్ని ప్రోత్సహించిన కందుకూరి గొప్ప ఆదర్శవాది అన్నారు. ఆయన చేసిన సాహిత్య సేవను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.శ్రీలక్ష్మీ, జి.బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన


నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

పెద్దాపురం: ఏళ్ల తరబడి విధులు నిర్వర్తిస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ బుధవారం నల్ల రిబ్బన్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉపాధి హామీ, ఎంపీడీఓ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎంపీడీఓ శ్రీలలిత, ఏపీఓ సుధీర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇనకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ, 19 ఏళ్ల తమ సర్వీసును పరిగణనలోకి తీసుకుని, ప్రతి ఒక్కరినీ పంచాయతీ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. జీతాల పెంపుదల చేసి, విద్యార్హతల ఆధారంగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారమయ్యే వరకూ మరింత ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

సీఐ విజయశంకర్


హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సీఐ

పెద్దాపురం: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పెద్దాపురం సీఐ పి.విజయశంకర్ అన్నారు. బుధవారం పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో హెల్మెట్ వినియోగంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లైసెన్సు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని, యువత డ్రైవింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని, స్లో డ్రైవింగ్ చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ భూముల్లో ఆక్రమణలు తొలగించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కరప: శహపురం డ్రెయిన్‌కు ఆనుకుని ఉండే భూములను ఆక్రమించుకుని ఆక్వా చెరువులు తవ్వడం వల్ల తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని, ఆక్రమణలను తొలగించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ ఎస్.సత్యనారాయణకు పలువురు రైతులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, శహపురం డ్రెయిన్ పరిధిలోని కరప సమీపంలో పోరంబోకు భూములను కొంగోడు గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకుని ఆక్వా సాగు చేస్తున్నాడన్నారు. డ్రెయినేజీ భూములు ఆక్రమించుకుని, చెరువులు తవ్వడం వల్ల తమ పొలాల్లోని మురికినీరు, ముంపునీరు డ్రెయిన్‌లోకి దిగక, పంటలు ముంపునకు గురవుతున్నాయన్నారు. సముద్రం పోటు, పాటులకు వచ్చేనీరు పొలాల్లోకి చేరి, సారవంతమైన భూములు చౌడుదేరుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా సాగు వ్యర్థాలను, బురద మట్టిని తోడటం వల్ల శహపురం డ్రెయిన్ పూడుపోయిందని, నీరు లాగక పొలాలు ముంపునకు గురవుతున్నాయని వివరించారు. శహపురం డ్రెయిన్‌ను పరిశీలించి, ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. రైతులు జి.సత్యనారాయణ, జి.బాలసూర్యనారాయణ, రాజాల అప్పారావు, బుడిత శ్రీను, ఎం.గోవిందరాజు, మోకన రాజు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు గుండెపోటు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి గుండెపోటుకు గురయ్యారు. బుధవారం తెల్లవారుజామున 2.30 సమయంలో గుండెపోటు రాగా, బంధువులు ఆమెను స్థానిక ట్రస్ట్ ఆస్పత్రిలో చేర్చారు. ఆస్పత్రిలో చేర్చడం ఆలస్యమై ఉంటే ప్రాణాపాయం వాటిల్లేదని వైద్యులు తెలిపారు. అత్యవసర స్థితి నేపథ్యంలో స్టంట్ వేశామని, ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ట్రస్ట్ ఆస్పత్రిలో డాక్టర్ లావణ్యకుమారిని పరామర్శించి, ఆరోగ్య స్థితిపై ఆరా తీశారు. రంగరాయ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, ఇతర వైద్య ప్రముఖులు ఆమెను పరామర్శించారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పిఠాపురం: మహిళా సంఘాలు బ్యాంకు లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని ఉన్నతి యాంకర్ పర్సన్ పి.సూర్యనారాయణ అన్నారు. చేబ్రోలు మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. బ్యాంకులో సంఘ సభ్యులు దాచే పొదుపు, పొందే రుణాలపై పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. రుణాలు అందించడంలో బ్యాంకుల అలసత్వం ప్రదర్శిస్తే.. ప్రశ్నించేలా ఉండాలని, అందుకనుగుణంగా మహిళా సంఘాలు తయారు కావాలన్నారు. శ్రీనిధి ఏజీఎం చిట్టిబాబు మాట్లాడుతూ, రుణాలు తీసుకోవడంలోను, చెల్లించడంలోను క్రమశిక్షణ కలిగి ఉండాలని, తద్వారా రుణాలు అందించడంలో శ్రీనిధి ముందుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సన్యాసిరావు, సీసీలు నాయుడు, రమణ, పలువురు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి రైతన్న విలవిల

- నేలనంటిన అరటి తోటలు
- భారీఎత్తున వాణిజ్య పంటలకు నష్టం
- అంచనాల్లో అధికారులు తలమునకలు


వర్షాలకు దెబ్బతిన్న మునగ తోట

పిఠాపురం: ఆరుగాలం శ్రమించిన అన్నదాత అకాల వర్షానికి విలవిల్లాడుతున్నాడు. వాతావరణంలో ఏర్పడిన మార్పులతో, ఈదురు గాలులతో కూడిన వర్షం కొద్ది రోజులుగా కురవడంతో వరి, వాణిజ్య పంటలు సాగు చేసిన రైతులు బెంబేలెత్తుతున్నారు. మూడు రోజుల క్రితం భారీ గాలులతో కూడిన వర్షం వల్ల పిఠాపురం నియోజకవర్గంలో పలు అరటి తోటలు నేలనంటాయి. దీంతో తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. గతంలో ఎదురైన కష్టనష్టాలను మరువకుండానే మరో విపత్తు ఎదురైంది. గతేడాది నెలకొన్న నష్టాల నుంచి తేరుకుందామనే ఆశతో ఆరుగాలం పండించిన పంట చేతికి దక్కే సమయంలో వర్షం తీరని నష్టం చేకూర్చింది. వాతావరణం బాగుండడంతో పంట ఆశాజనకంగా పండింది. తమ కష్టాలు తీరుతాయనే రైతుల ఆశలపై అకాల వర్షం నీళ్లు చల్లింది.

38 వేల ఎకరాల్లో సాగు

నియోజకవర్గ పరిధిలో పీబీసీ, ఏలేరు, ఆర్ఆర్‌బీ ట్యాంక్, చెరువులు, బోర్ల కింద సుమారు 38 వేల ఎకరాల్లో దాళ్వా సాగు చేశారు. ప్రస్తుతం మూడొంతుల కోతలు పూర్తయ్యాయి. ఈ దశలో వర్షం కురవడంతో పనలపై ఉన్న వరిచేలు తడిసి ముద్దయ్యాయి. కళ్లాల్లో ఉన్న ధాన్యం చుట్టూ నీరు చేరింది. పల్లపు ప్రాంతాల్లోని వరి పనల్లో నీరు చేరింది. వరి చేలు చాలా చోట్ల నేలనంటాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరో 24 గంటల పాటు వర్షం పడితే పనలపై ఉన్న వరి చేలు మొలకెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. నేలనంటిన చేలను కోయడానికి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు. కాగా కళ్లాల్లో ఉన్న ధాన్యం రాసులను ఎడ్లబళ్లపై తరలిస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పండిన కొద్ది పంటనైనా దక్కించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

వాణిజ్య పంటలకూ..

అకాల వర్షం వల్ల వాణిజ్య పంటలకు తీరని నష్టం జరిగే అవకాశం ఉంది. గొల్లప్రోలు , పిఠాపురం మండలంలోని విరవాడ, విరవ, మంగితుర్తి, గొల్లప్రోలు, చేబ్రోలు, దుర్గాడ, ఎ.విజయనగరం, చెందుర్తి, తాటిపర్తి గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలకు పైబడి వాణిజ్య పంటలు సాగు చేశారు. కోత దశలో ఉన్న సమయంలో వర్షం కురవడంతో భారీ నష్టం సంభవించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. బొప్పాయి, మునగ, బెండ, అరటి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో ఉద్యాన శాఖ అధికారులు పంటల నష్టాలను అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.


పిఠాపురం మండలంలో విరవలో నేలనంటిన అరటి తోట


విరవాడలో వర్షాల వల్ల నష్టం జరిగిన అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి


వర్షానికి దెబ్బతిన్న బొప్పాయి తోట


వర్షానికి పాడైపోయిన బెండ పాదులు